www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

రూ.కోట్లు కుమ్మరించారు!?

రూ.22 కోట్లపైగా పంపిణీ
ఒక్కో ఓటుకు రూ.ఐదు వేలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జడ్‌పిటిసి ఉపఎన్నికల్లో డబ్బుల వరద పారింది. కడప, అన్న మయ్య జిల్లాల పరిధిలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నిక బరిలో నిలిచిన ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటా పోటీగా నగదు పంపిణీ చేయడం విస్మయాన్ని కలిగించింది. పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికలో గరిష్టంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ. ఐదు వేల చొప్పున పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన పులివెందుల జడ్‌పిఇసి పరిధిలోని 10,600 ఓట్లలో 90 శాతం మేరకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈలెక్కన ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి ఓటుకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేసినట్లు అంచనా. ఈలెక్కన సగటున రూ.10 కోట్లు ఖర్చు చేసిన ట్లు తెలుస్తోంది. ఇదేతరహాలో ఒంటిమిట్ట జడ్‌పిటిసి పరిధిలో ప్రధాన పార్టీలకు చెందిన టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటుకు రూ.మూడు వేల నుంచి రూ. నాలుగు వేల వరకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన ఇద్దరు నగదు పంపిణీని లెక్కిస్తే ఓటుకు రూ.ఏడు వేలు చొప్పున ఖర్చు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈలెక్కన 26 వేల మందిలో 90 శాతం మందికి 19 వేల నుంచి 20 వేల మందికి రూ.12 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు పంపిణీ చేసి నట్లు తెలుస్తోంది. దీనికి మద్యం ఖర్చు అదనమని గ్రహించాలి. ఇదిలాఉండగా జడ్పీటిసి ఉపఎన్నిక ఎనలేని రాజకీయ ప్రాధా న్యత సంతరించుకున్న నేపథ్యంలో ఉప ఎన్నికల ప్రచారంలో ఎదు రైన చేదు అనుభవాల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పా ట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఉపఎన్నికల పరిధిలో పులివెందుల జడ్పీటిసి ఉపఎన్నిక ప్రాంతానికి 650 మంది, ఒంటిమిట్ట జడ్పీటిసి ప్రాంతానికి 700 మంది చొప్పున రెండు జడ్పీటిసిల పరిధిలో 1,3 50 మంది పోలీసుల పర్యవేక్షణలో ఉపఎన్నికలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించడానికి అవసరమైన కసరత్తు చేస్తుండడం గమనార్హం.

ష్..గప్-చిప్..!

ముగిసిన ఎన్నికల ప్రచారం
ఎత్తుకు పైఎత్తుల్లో అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నుంచి రాజకీయ పార్టీల రథాల మైకులు మూగపోయాయి. ఈనేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాల అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కడప జిల్లాలోని పులి వెందుల, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉపఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు విజ యావకాశాలపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా మంత్రాంగం నడుపుతు న్నారు. ఇప్పటివరకు నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా, ప్రచారం ముగిసిన దగ్గర నుంచి పోలింగ్ రోజున ఓటింగ్ పో లరైజేషన్ చేయడంపై రాజకీయ నాయకత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉపఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు బలాబలా లను కూడగట్టుకునే పనిలో మరోసారి నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా తమ బంధు, మిత్ర, కళత్ర వర్గాలు ఏగ్రామాల్లో ఉన్నారు. వారి అవసరాలేమిటి, వారిలో ఎవరిని ఎలా లోబరుచుకోవాలనే ప్రయోగాలు చేయడంపై దృష్టి సారించారు. బంధు, మిత్ర ప్రయో గాల ద్వారా, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రలోభాలకు గురి చేయడం ద్వారా ఓటింగ్ పెంచుకోవడంపై దృష్టి సారించారు. దీంతో పాటు ఎన్నికల్లో ఎలా గెలవాలనే అంశంపై సీరియస్‌గా దృష్టి సారిం చారు. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎలాగైనా గెలిచి రాజ కీయంగా పైచేయి సాధించాలనే ఉద్దేశంతో కసరత్తు చేస్తున్నారు. ఇందుకుగానూ రాష్ట్రంలోని నలుమూలల నుంచి అమాత్యులు మొదలుకుని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రంగాలకు చెందిన ప్రజాప్రతినిధుల వరకు ముమ్మరంగా కసరత్తు చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

సమరశీల పోరాటాల ద్వారానే రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాంగ పరిషత్ రక్షణతో సామాజిక న్యాయం సాధ్యమని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాయచోటిలోని బంగ్లా సర్కిల్ వద్ద యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు పాఠశాలల పరిరక్షణకు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు, సమాజంతో కలిసి కృషి చేస్తున్న ఉద్యమ సంఘం యుటిఎఫ్ అన్నా రు. 51 సంవత్సరాలలో యుటిఎఫ్ సాధించిన విజయాల గురించి వివరించారు. 1975లో వచ్చిన మూడవ పిఆర్‌సిలో ఎన్‌జిఒలతో సమానంగా ఉపాధ్యాయుల వేతనాలు సాధించడం మొదటి విజయమని చెప్పారు. 1979లో ఎన్‌జిఒల కంటే అదనంగా వేతనాలు సాధించారన్నారు. 1986లో రీగ్రూపింగ్ స్కేల్స్ ద్వారా పదోన్నతి రాకపోయినా సర్వీసును బట్టి ఉద్యోగోన్నతి పేస్కేలు వచ్చేలా కృషి చేసింది యుటిఎఫ్ అన్నారు. భాషా పండితులకు గ్రేడ్ వన్ స్కేల్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నేరుగా జీతాలు అందేలా చూడడం జరిగిందన్నారు. 1998లోఉపాధ్యాయుల బదిలీలు కౌన్సెలింగ్ విధానం, అప్రెంటిస్ విధా నం రద్దు చేయించడం, రెండు నోషనల్ ఇంక్రి మెంట్ల సాధన, ఎస్‌సి,ఎస్‌టి ఉపాధ్యాయులకు రెండు గోషల్ ఇంక్రిమెంట్లు సాధించడం యుటిఎఫ్ ఘనత అన్నారు. విద్యార్థుల కోసం పదవ తరగతి టెస్ట్ పేపర్లు అనుభవజ్ఞులచే తయారు చేయించి అందుబాటు ధరలో అందించడమే కాకుండా అనేక సామాజిక ఉద్యమాలలో భాగస్వామిగా ఉందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థల ఏర్పాటులో సహకారాన్ని అందించిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల యుటిఎఫ్ కార్యాలయాలను కోవిడ్ ఐసోలేషన్ సెంటర్లుగా మార్చి సామాజిక చైతన్యాన్ని చాటామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, రాయచోటి మండల అధ్యక్షుడు హఫీజుల్లా, చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రాయచోటి మండల సహాధ్యక్షుడు రెడ్డిబసవయ్య, మండల కార్యదర్శి రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.



రాయచోటి : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు: ఎందరో మహానుభావుల త్యాగాల ప్రతిఫలం ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) అని ఆ సంఘ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి తెలిపారు. పీలేరులో డివిజన్ స్థాయి యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి. రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ అప్పారావు వెంకటస్వామి, దాచూరి రామిరెడ్డి, ఏవీఎస్ లాంటి గొప్ప నాయకుల త్యాగనిరతికి నిలువెత్తు సాక్ష్యమని, సంఘ పటిష్టతలో వారి సేవలు అమోఘమని కొనియాడారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతూ ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన అనేక హక్కులను సాధించిపెట్టిందని అన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక అంశాలను వెంటనే పరిష్కరించాలని, పిఆర్‌సి అరియర్స్, పిఎఫ్, ఏపీజిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్ విడుదల చేయాలని, అలాగే రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని, 12వ పిఆర్సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చంగా రెడ్డి, సుధాకర్, ఈశ్వర మహేంద్ర, వేణు గోపాల్, సీనియర్ నాయకులు చంగల్ రాయులు, రాధా కృష్ణ, నాన్నకే నాయక్, విజయ్ కుమార్, నారాయణ నాయుడు, రవికుమార్, దేవేందర్ రెడ్డి, అంజిరెడ్డి, పీరయ్య, వెంకటరమణారెడ్డి, వెంకటేష్, కరుణాకర్ రెడ్డి, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : పట్టణంలో యుటిఎఫ్ జెండా ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ చంగల్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వలన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయలేక బోధనేతర పనులకు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పిఆర్‌సి కమీషన్ వేయకుండా, మధ్యంతర భృతి ప్రకటించకుండా కాలయాపన చేయడం తగదని అన్నారు. వెంటనే పి ఆర్‌సి కమీషన్ వేసి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి.నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శివయ్య, సీనియర్ కార్యకర్తలు రమణయ్య, హరిప్రసాద్,పిఎస్ఎల్‌వి ప్రసాద్, సుబ్బరాయుడు, నరసింహా రావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మదనపల్లె : పట్టణంలోని ఎంఆర్‌సి ప్రాంగణంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు టి. సుధాకర్ నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే, పాఠశాలల పరిరక్షణ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమాజంతో కలసి కృషి చేస్తున్న ఉద్యమ సంఘమని యుటిఎఫ్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.రవిప్రకాష్, విజయ్‌కుమార్, సుధాకర్, శివ, మనోహర్, అంజాద్, శ్రీనివాసులు, భార్గవి, రామాంజులు పాల్గొన్నారు.



పీలేరులో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో ఉపాధ్యాయులు

పెన్నానదిలో చిక్కుకున్న యాత్రికులు

రక్షించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది
అందరూ సురక్షితం



యాత్రికులను కాపాడిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

పెన్నానదిలో చిక్కుకున్న ముగ్గురు యాత్రికులు చిక్కుకున్నారు. వారిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. వివరాలు.. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు రాజరాజేశ్వరి అపార్ట్‌మెంటుకు చెందిన గోవర్ధన్ రెడ్డి, రామలక్ష్మమ్మ, ఓబులమ్మ పౌర్ణమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సున్నపురాళ్లపల్లె మీదుగా జమ్మలమడుగు మండల పరిధిలోని కన్నెతీర్థంకు కారులో బయలుదేరారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జమ్మలమడుగు మండలం దానవులపాడు - సున్నపురాళ్లపల్లె మధ్య పెన్నా నదిపై వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు నది మధ్యలో చిక్కుకుపోయారు. విషయం తెలుసుకన్న జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో చిక్కుకున్న ముగ్గురిని తెప్పల సాయంతో వారిని రక్షించారు. తమను రక్షించిన పోలీసులకు అగ్నిమాపక సిబ్బందికి టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి కృతజ్ఞతలు యాత్రికులు తెలియజేశారు.

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో రైతుల అందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కరించడమే తమ ధ్యేయమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో కార్యాలయాలు, ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం, పంటలు అధిక దిగుబడి సాధించాలంటే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఉద్యానవనశాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా ఉద్యాన కార్యాలయం ఉంది. జిల్లా వ్యాప్తంగా 9 మంది ఉద్యాన అధికారులున్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, సుండుపల్లి, రాజంపేట, రైల్వేకోడూరు, రైల్వేకోడూరు ఫామ్, పీలేరు, మదనపల్లి, ములకలచెరువులలో ఉద్యానవన కార్యాలయాలున్నాయి.

జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం ఎంత?

ఖరీఫ్‌లో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 1,38, 998 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు విస్తీర్ణం ఉంది. 9,17,83 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. రైతులకు ఇ- పంట నమోదు ప్రక్రియ కూడా రైతు సేవ కేంద్రాల పరిధిలో జరుగుతుంది.

ఏ పంటలు అధికంగా రైతులు సాగు చేస్తున్నారు?

అన్నమయ్య జిల్లాలో ప్రధానంగా 73,564 ఎకరాల్లో మామిడి, 56,50 ఏకరాల్లో టమాట ,అరటి 3,655, నిమ్మ 2,115 ఎకరాల్లో పంటలను, ఇతర పండ్లు, కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

జిల్లాలో నర్సరీలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఫామ్‌లో నిమ్మ, చీనీ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 436 కూరగాయలు, పండ్ల మొక్కల ప్రయివేట్ నర్సరీలున్నాయి. నర్సరీలు ప్రధానంగా మదనపల్లి, ములకలచెరువు, బి.కొత్తకోట, వాయల్పాడు, పీలేరు, రాయచోటి, కోడూరు ప్రాంతాల్లో ఉన్నాయి. నర్సరీలో మామిడి, బొప్పాయి, టమాట, మిరప, వంకాయ ఇతర కూరగాయల రకాలు అందుబాటులో ఉంటాయి.

జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎలాంటి పంటలను ఎగుమతి చేస్తున్నారు?

జిల్లా నుంచి మామిడి, అరటి, బొప్పాయి, టమాట వంటి వాటిని ఎక్కువగా తమిళనాడు, చెన్నై,ముంబై, ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవు తున్నాయి. రైతులు నాణ్యమైన దిగుబడుల ు ఎగుమతి చేస్తే అధిక ఆదాయం పొందవచ్చు.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా ఉద్యానవన శాఖలో ఎటు వంటి సిబ్బంది కొరత లేదు.

అధిక దిగుబడి పొందాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

రైతులు అధిక దిగుబడి కోసం సమగ్ర యాజ మాన్య పద్ధతులను పాటించాలి. నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే రకాలను సాగుకు ఎంచుకోవాలి. బిందు సేద్య విధానంలో ఎరువుల యజమాన్యం చేపట్లాఇ. ఎప్పటికప్పుడూ సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టాలి. శాస్త్ర వేత్తలు, ఉద్యాన అధికారులు సూచనలతో అధిక దిగుబడులను పొందవచ్చు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిఆర్‌టి పాఠశాల లో సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. అమ్మపేరుతో మొక్క నాటి సంరక్షిద్దామని ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు సీనియర్ సిటిజన్స్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ మనిషి మనుగడ ఆరోగ్యంగా కొనసాగాలంటే పచ్చదనం మెండుగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. నేడు నాటిన మొక్కలు, భావితరాల భవి ష్యత్తుకు అండగా ఉంటాయని తెలిపారు. చెట్లు సంమృద్ధిగా ఉంటేనే పుష్కలంగా అక్సిజన్ అంద డంతో పాటు సకాలంలో వర్షాలు కురిసి, కాలుష్యం నుండి బయటపడి ఆరోగ్యంగా మనుగడ సాగించే వీలు కలుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ సైతం చెట్లు ఉంటేనే సాధ్యమన్నారు. పట్టణంలో విరి విగా మొక్కలు నాటి పచ్చదనంతో హరిత వనంగా మార్చాలని ఆకాంక్షించారు. ఎన్‌వి నాయుడును ఆర్గనైజర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గొల్లపూడి తిరుపతిరావు, టిఎస్‌ఎ కృష్ణమూర్తి, జగన్‌మోహన్, కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్ ఖాన్, శ్రీనివాసులు, వెంకటరమణ నాయుడు, ధనలక్ష్మి, సరస్వతి, ప్రేమ, రాధికా బాయ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీనియర్ సిటిజన్స్

డాక్టర్ పాల్ రవికుమార్‌కు సన్మానం



డాక్టర్ పాల్ రవికుమార్‌ను సన్మానిస్తున్న బాస్, విసికె నేతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంబేద్కర్ అనుచరుడుగా, పేదల పక్షపాతిగా 31 ఏళ్ల వైద్య వృత్తిలో నిస్వార్థ సేవలు అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్ పాల్ రవికుమార్ అని భారతీయ అంబేద్కర్ సేన అధ్యక్షుడు పిటియం శివప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా డిసిహెచ్ఎస్‌గా సేవలందిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మదనపల్లెకు చెందిన ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ పాల్ రవికుమార్‌ను విసికె పార్టీ - భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పాల్ రవికుమార్ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడిగా, వైద్యాధికారిగా 31 పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించారన్నారు. తన ఉద్యోగ జీవితంలో ఒక్క పైసా కూడా లంచం తీసుకోని, అరుదైన అవినీతి రహిత అధికారి అని చెప్పారు. అంబేద్కర్ చెప్పిన శీలవంతమైన జీవన మార్గాన్ని కొనసాగిస్తూ, పే బ్యాక్ టూ ద సొసైటీ కోసం జ్ఞానాన్ని, ధనాన్ని, సమయాన్ని వెచ్చిస్తున్న సిసలైన అంబేద్కర్ అనుచరుడు డాక్టర్ పాల్ రవికుమార్ అన్నారు. ఆయన జీవితం నేటి తరం ఉద్యోగులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ తనను ఘనంగా సన్మానించిన బాస్, విసికె ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విశ్రాంత విద్యాధికారి ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ఎస్బీఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ మునివెంకటప్ప, ప్రముఖ గాయని భూదేవి, బాస్ రాష్ట్ర నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, ఉద్యోగ సంఘ నాయకులు చిట్టిబాబు, గంపల శీనప్ప, పార్థసారథి పాల్గొన్నారు.

మోస్ట్ వాటెండ్ ఎర్రచందనం

స్మగ్లర్ నాగదస్తగిరిరెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో లంక మల్ల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న మోస్ట్‌వాటెండ్ ఎర్రచందనం స్మగ్లర్ నాగ దస్తగిరిరెడ్డిని ఆకస్మికంగా దాడులు నిర్వహించి పోలీసులు అరెస్టు చేశారు. అతనితోపాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు టన్ను బరువు ఉన్న 52 ఎర్రచందన దొంగలను, రెండు కార్లు, ద్విచక్రవానం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం చాపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేస్తూండగా కారులో ఎర్రచందనం దుంగలను గమనించి వాటిని స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. స్మగ్లర్లు ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డి, ముదిరెడ్డి రామమోహన్ రెడ్డి, ఉమ్మనబోయిన కృష్ణయ్య, కాయలి శ్రీనివాసులు, బండ్రెడ్డి ఓబుల్ రెడ్డి, శనివారపు బాల గంగిరెడ్డిని అరెస్టు చేశారని తెలిపారు. ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డి గతంలో మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ అని చెప్పారు. సుమారు 86 ఎర్రచందనం కేసులు, 34 దొంగతనాల కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. మూడుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేశారని తెలిపారు. ఇతని భార్య లాలుబి పై కూడా ఎర్రచందనం కేసులు ఉన్నాయని చెప్పారు. ఈమె ప్రస్తుతం జైలులో ఉన్నారని పేర్కొన్నారు. ఇతని కుటుంబ సభ్యులు లులూ బాషా, పక్రుద్దీన్, జాకీర్ పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్లని తెలిపారు. వీరిపై వందల కేసులు, అనేకమార్లు పీడీ యాక్ట్‌లు ఉన్నట్లు చెప్పారు. పాలకొండలు, లంక మల్ల అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దొంగలను నరికి ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తూ ఉంటారని పేర్కొన్నారు. ఇతని అనుచరులు కూడా ఇందులో భాగస్వాములను తెలిపారు. ఢిల్లీలో ఉండే సలీం ప్రధాన స్మగ్లర్‌కు హవాలా వ్యాపారి ద్వారా హైదరాబాదులో ఉండే విక్రమ్‌సింగ్ సోలంకి అనే అతని ద్వారా డబ్బులను హవాలా రూపంలో నాగ దస్తగిరి రెడ్డికి అందజేసేవారని చెప్పారు. విక్రమ్ సింగ్ సోలంకిని వారం రోజుల కిందట అరెస్టు చేశామని పేర్కొన్నారు. స్మగ్లర్లను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన టాస్క్‌ఫోర్సు సిఐ శంకర్‌రెడ్డి, సిబ్బంది, మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్, వారి టీం సభ్యులు, చాపాడు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య, వారి సిబ్బందిని అభినందించారు. ఎర్రచందనం చెట్లను నరికినా, అమ్మినా, కొన్నా, దాచి ఉం చినా, అక్రమ రవాణా చేసినా, ఏ విధంగా సహకరించినా అట్టి వారిపై నాన్ బయిలబుల్ కేసు పెట్టి, హిస్టరీ సీట్ తెరుస్తామని హెచ్చరించారు. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశా రు. అక్రమ కార్యకలాపాల సమాచారం తెలిస్తే ప్రజలు పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

రూ.5 లక్షల విద్యా సాయం పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె

పట్టణంలోని సొసైటీ కాలనీలో గల లయన్స్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో అనురాధ భాస్కర్‌నాయుడు ట్రస్టు ఆధ్వర్యంలో బిటెక్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు రూ.5లక్షలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఛాన్సెలర్ డాక్టర్ యన్. విజయభాస్కర్ చౌదరి హాజరై మాట్లాడారు. ఎబిఎన్ ట్రస్టు ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఐదు లక్షల రూపాయలు అందించడం గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెక్కులు అందించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందజేశారు. ట్రస్ట్ ద్వారా చదువుతున్న విద్యార్థులకు మిట్స్ యూని వర్సిటీలో 50శాతం రాయితీ కల్పిస్తామని డాక్టర్ విజయభాస్కర్ చౌదరి ప్రకటించారు. ఈసందర్భంగా డాక్టర్ భాస్కర్ నాయుడు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గంగారపు రాందాస్ చౌదరి, ఆడిటర్ ప్రసాద్, గంగారపు గౌతమ్, బోడిపాటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, డిష్ రవి పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న విజయభాస్కర్‌చౌదరి



ఎంఇఒలతో మాట్లాడుతున్న విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాము

మూల్యాంకన పుస్తకాల స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని పాఠశాలలకు మంజూరైన మూల్యాంకన పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆదివారం విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జిలకర రాము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి తరగతుల వారీగా మూల్యాంకన పుస్తకాలు మండలానికి ఎన్ని వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, మిగిలిన పుస్తకాలు ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. మిగులు పుస్తకాలను పక్క మండలాలకు పంపించాలని సూచించారు. విద్యాశాఖ చరిత్రలో మొదటి సారిగా మూల్యాంకన పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. మండలాల వారిగా మూల్యాంకన పుస్తకాల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామాపురం విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, సంబేపల్లి ఎంఇఒ-2 శ్రీనివాసులు, సుండుపల్లి ఎంఇఒ-2 రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

నేడు ఎఎంసి చైర్‌పర్సన్‌గా వరలక్ష్మి ప్రమాణస్వీకారం

-హాజరుకానున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-రైల్వే కోడూరు



పగడాల వరలక్ష్మి

రైల్వేకోడూరు నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పగడాల వరలక్ష్మి సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వరలక్ష్మి భర్త పగడాల చంద్రశేఖర్, అతని సోదరుడు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో ఉదయం 11 గంటలకు మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకాను న్నట్లు వారు తెలిపారు. కూటమి పార్టీల ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని నియోజకవర్గ కూటమి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రమాణ స్వీకార అనంతరం కార్యక్రమానికి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు విందు భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆపరేషన్ సహార్‌తో ఆదివాసీలకు ముప్పు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశంలో మోడీ సర్కార్ కార్పొరేటర్లను పెంచి పోషించేందుకు ఆపరేషన్ సహార్ ను తీసుకొస్తోందని, దీనివల్ల అడవి సంపద పైనే ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు ముప్పు పొంచి ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం మదనపల్లెలో సిపిఐ అన్నమయ్య జిల్లా 2వ మహాసభలు ప్రారంభమయ్యాయి. స్థానిక మిషన్ కాంపౌండ్ నుంచి శ్రీకృష్ణ కల్యాణ మండపం వరకు సిపిఐ శ్రేణులు ప్రదర్శన సాగించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్పోరేట్ల ను సంపన్నులు చేసేందుకు మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అలుపెరిగిన పోరాటం చేస్తుందన్నారు. ప్రశ్నించే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేసి, ఉన్మాదులుగా చిత్రీకరిస్తూ ప్రశ్నించే గొంతు కలను సంహరిస్తున్నారని దుయ్యబట్టారు. మోడీ 12 ఏళ్ల పాలనలో పెట్రోల్, డీజిల్ నిత్యావసర సరుకు లను తగ్గించకపోగా విపరీతంగా పెంచి, సామాన్యుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. గుజరాతీయులైన ఆదాని, అంబానీ లకు దేశ సంపదను దోచి పెట్టేందుకు మోడీ, అమిత్ షా లు కంకణం కట్టుకున్నారని నిప్పులు చెరిగారు. ప్రజలను, పేదలను, కార్మిక వర్గాలను అణగదొక్కుతూ, హక్కులను కాలరాస్తూ, దేశాన్ని అమ్మకానికి పెట్టిన దుర్మార్గులు మీరు కాదా అని మోడీని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహులు, సిపిఐ నాయకులు తోపు కృష్ణప్ప, సాంబశివ, మురళి, తిరుమల, ముబారక్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారి శ్రీకర్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట



శ్రీకర్(ఫైల్ ఫొటో)

పుల్లంపేట మండలం వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న కురన్నతుల శ్రీకర్(45) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అనారోగ్యానికి గురై తిరుపతిలోని బాలాజీ మెడికల్ కాలేజీలో మృతిచెందారు. సోమవారం ఆయన స్వగ్రామం లక్కిరెడ్డిపల్లి మండలంలోని చౌటుపల్లె గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు. కాగా విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన వ్యవసాయ అధికారి శ్రీకర్ మృతి చెందడంతో తోటి ఉద్యోగులు, అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి మృతి బాధాకరం

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లె మండలం దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్ రెడ్డి మృతి బాధాకరమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి వేణుగోపాల్ రెడ్డి చేసిన కృషి అమోఘమైందని, ఆయన సేవలు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఒక మంచి ప్రజా నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఆయనతో తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను గుర్తు చేసుకున్నారు. వేణుగోపాల్ రెడ్డి కుమారులు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి వారి సోదరులతోనూ ఫోన్ ద్వారా మాట్లాడి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చిన్నేరులో పెద్ద చేప

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



పది కిలోల చేపను చూపిస్తున్న జాలరి

తంబళ్లపల్లెకు సమీపంలోని పరసుతోపు వద్ద ఉన్న చిన్నేరు జలాశయంలో ఆదివారం ఉదయం పది కిలోల పెద్ద చేప జాలరుల వలకు చిక్కింది. గుండ్ల పల్లె పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన ఓజాలరి తంబళ్లపల్లెలో దీనిని రూ.1300కు విక్రయిం చారు. గుండ్లపల్లె, తంబళ్ల పల్లె(పరసుతోపు)-2 పంచాయతీల్లో ఉన్న చిన్నేరు జలాశయంలో చేపల పెంపకానికి వేలంపాట నిర్వహిస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు స్థానిక జాలర్లకు ఉపాధి లభిస్తుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజవకవర్గ పరిధిలో సిఎం సహాయ నిధి కింద 20 మంది బాధితులకు ఆదివారం రూ.11.35 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఎవరైనా ఉంటే వారికి ఆర్థికంగా నష్టపోకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి శ్రేణులు

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. మదనపల్లె మండలం పెంచుపాడులో వైసిపి శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందన్నారు. రైతులకు సకాలంలో యూరియా, విత్తనాలు పంపిణీ చేయడంలో చేతులెత్తేసిందని, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసిందని విమర్శలు గుప్పించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులకు జరిగిన మంచిని వివరించారు. కూటమి ఏడా దిన్నర పాలనలో సూపర్ సిక్స్ అమలు చేయకపోగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతును రాజుగా చూడాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశార న్నారు. రైతు పంటవిత్తనం వేసిన దగ్గర నుండి పంటకు మద్దతు ధర వచ్చేవరకు రైతన్నలకు జగన్ సర్కారు భరోసాగా ఉండేదన్నారు. ప్రస్తుతం రైతులకు కావలసిన యూరియా కేటాయింపు విషయంలో డిమాండుకు సరిపడా సరఫరా లేదని మండిపడ్డారు. రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉందని, సంపద సృష్టిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పిన చంద్రబాబు రైతన్నకు కావలసిన యూరియా సరఫరా చేయలేక పోతున్నారని అన్నారు. మరోవైపు రామసముద్రం - మదనపల్లె రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గెలిపించిన ప్రజలను మోసం చేయడం బాబు కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ దండు కరుణాకర్ రెడ్డి, శామలమ్మ, సీనియర్ నాయకులు దండు కృష్ణారెడ్డి, మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఆపరేషన్‌కు ఎంపికైన వృద్ధులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-రాయచోటి

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్‌వి అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని రాజు స్కూల్‌లో 180 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు పి.శ్యామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మందికి శస్త్ర చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం శస్త్ర చికిత్సలు చేయించి వారికి అవసరమైనటువంటి అద్దాలను అందించి తర్వాత తిరిగి వారిని రాయచోటికి చేర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్ మాట్లాడుతూ అందత్వ నివారణ అర్థం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఏర్పడిందని అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. గతంలో కూడా ఎన్నో శస్త్ర చికిత్సలు నిర్వహించారని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అధ్యక్షుడు లయన్ పి. శ్యామ్ దాతృత్వం తో అందించారని ఉపాధ్యక్షుడు లయన్ వి.హరీష్ చంద్ర తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఎస్ హరినాథ్ రెడ్డి, కార్యదర్శి షేక్.ఇందాద్ అహమ్మద్, కోశాధికారి కె.మనోహర్ రాజు, షంషీర్ వలి,శ్రీనివాసులు, శ్రీని వాసులరెడ్డి, ఎస్‌వి కంటి ఆసుపత్రి డాక్టర్లు ప్రవళిక, శ్రీలలిత, కౌన్సిలర్ జనని,వాలంటీర్ శ్రీకాంత్ రెడ్డి,క్యాంపు ఇన్‌ఛార్జి దిలీప్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మానవత చైర్మన్ బాలసుబ్రమణ్యం, అధ్యక్షులు టి.ఉమాపతిరెడ్డిలు పేర్కొన్నారు.ఆదివారం స్థానిక నలంద విద్యానికేతన్ హైస్కూల్ లో మానవత ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర అరవింద్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు ఇందులో.దాదాపు 150మంది వైద్యసదుపాయాన్ని పొందగలిగారు. 28మంది కంటి చికిత్సకు ఎంపికయ్యారు. వీరికి తమ వాహనంలోనే తీసుకెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి స్వస్థలానికి చేరుస్తామని వైద్యులు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పక్కీరయ్య,సెక్రటరీ వీరనాగిరెడ్డి, కోశాధికారి రవిశంకర్, ఇసి ఎడ్యుకేషన్ హెచ్‌సి శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉల్లి సాగుపైనే రైతుల ఆశలు

- పులివెందుల నియోజకవర్గంలో 4వేల ఎకరాల్లో సాగు
- పెరుగుతున్న పెట్టుబడులు
- ధరలపై రైతుల్లో ఆందోళన



సాగులో ఉన్న ఉల్లిపంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది ఉల్లి పంట ఆశాజనకంగా కనబడుతోంది. ఆ పంటపై రైతులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి. ఉల్లికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అంతేకాక సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే. ధరలు ఉంటే ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు చేశాక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగు చేశాక నిర్లక్ష్యం చేస్తే సాగులో దిగుబడులు చేతికి రావు. ఒకసారి పంట తెగుళ్లతో దెబ్బతింటే తేరుకోవడం కష్టం. దీంతోనే రైతులు ఉల్లి పంటను జాగ్రత్తగా కాపాడు కుంటున్నారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు వేయడం ద్వారా సాగులో దిగుబడులు తగ్గిపోయి నష్టాలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో రైతులు పంట మార్పిడితో ఉల్లి పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఉల్లి సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది ఎంతోకొంత పెరుగుతూనే ఉంది.

నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే సాగు..

ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఉల్లి సాగు విస్తీర్ణం పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే ఉల్లి సాగైనట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దాదాపు 1000 ఎకరాలకుపైనే సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పవచ్చు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె, తొండూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలోనూ, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల్లో అక్కడక్కడ రైతులు ఉల్లి సాగు చేసుకున్నారు. వ్యవసాయ బావులు, బోర్ల కింద ఉల్లి పంటల రైతులు సాగు చేసుకున్నారు. సాగులో పెరుగుతున్న పెట్టుబడులు ఉల్లి సాగులో ఏడాదికేడాది పెట్టుబడులు పెరుగుతున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఉల్లి విత్తనాలు శేరు రూ.600 ఉంటే ఈ ఏడాది శేరు ఉల్లి విత్తనాలు రూ.1,900కు పెరిగిపోయాయి. ఉల్లి సాగులో ఎకరాకు దిగుబడి సమయానికి రూ.50వేలుకుపైగానే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఉల్లి విత్తనాలు మొలకెత్తినప్పటి నుంచి దిగుబడులు అందేవరకు తోటలలో కలుపు తీయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఉల్లి సాగులో పనులకు కూలీ కూడా ఎక్కువగానే ఉంటోంది. పంట కాలం పూర్తయ్యాక ఉల్లి గడ్డలు పీకి వేయడానికి, కోత కోయడానికి ఆదనంగా మరో రూ.20వేల వరకు ఖర్చులు అవుతాయని రైతులు చెబుతున్నారు.

120 రోజులకే దిగుబడులు..

ఉల్లి సాగులో దిగుబడులు 120 రోజులకు అందుతాయి. ఈ ఏడాది రైతులు జూన్ మాసంలో ఉల్లి సాగు చేశారు. ఉల్లి పంట సాగు చేసిన 12 రోజులకు మొలకెత్తుతుంది. ఉల్లి విత్తనాలను కర్నూలు జిల్లా నుంచి తెచ్చుకుని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి నాలుగు రోజులకోసారి నీటితడులు ఇవ్వడం.. వారానికోసారి పంటలో కలుపు తీసే పనులు చేపడతారు. అంతే కాక వారానికోసారి తెగుళ్లు సోకకుండా మందులను పిచికారి చేస్తారు. వర్షాలు ఎక్కువగా కురిసిన పంట దెబ్బతినే ప్రమాదం ఉండడంతో వర్షపు నీరు పంటలో నిల్వ లేకుండా చూసుకుంటున్నారు.

కలుపు పడకుండా జాగ్రత్తలు..

ఫ్లుక్లోరాలిన్ 45 శాతం ఎకరానికి ఒక లీటరు చొప్పున పిచికారి చేసి భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్ 30 శాతం ఎకరానికి 1.3 నుండి 1.6 లీ.లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 23.5 శాతం 200మి.లీ.చొప్పున నాటే ముం దు పిచికారీ చేయాలి. నాటిన 30నుంచి45 రోజుల మధ్య కలుపు తీయాలి.

మార్కెట్ ధరలు స్థిరంగా ఉండాలి..

ఉల్లిసాగు పెట్టుబడులతో కూడుకున్నదే అయినా.. ఆదాయం ఉంటుందనే సాగు చేస్తున్నాం. ఉల్లి సాగులో ఆదాయాన్ని శాసించేది ధరలే. మార్కెట్లో ధరలు స్థిరంగా ఉండాలి. ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. ఉల్లి పంటను వేలకు వేలు పెట్టుబడులతో సాగు చేస్తున్నాం. ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతాం.

- ఉత్తమ్మ, ఉల్లి రైతు, నారేపల్లి, వేముల మండలం

ధర ఉంటేనే ఉల్లి రైతులకు ఆదాయం..

ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. అందుకే ఉల్లి సాగులో ఆదాయం రావాలంటే ధరలు ఉండాలి. ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చినా ధరలు లేకపోతే పెట్టుబడులు కూడా రావు. అదే ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడులు వచ్చి ధర క్వింటా రూ.2 వేలకుపైనే ఉన్నట్లయితే పెట్టుబడులు కూడా పోనూ.. ఆదాయం ఉంటుంది.

- గంగిరెడ్డి, రైతు, పులివెందుల

మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా..

నాకున్న మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా. పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. పంట సాగు చేసి రెండు నెలలు కావస్తోంది. మరో రెండు నెలల్లో దిగుబడులు వస్తాయి. దిగుబడులు అందే సమయానికి ధరలు బాగుంటే ఆదాయం వస్తుంది. సాగులో రూ.1.50 లక్ష మేర ఖర్చు పెట్టా. ధరలపైనే సాగులో వచ్చే ఆదాయం ఆధారపడి ఉంది.

- భాస్కర్ రెడ్డి, ఉల్లి రైతు, లింగాల మండలం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

సమాజాన్ని చైతన్యపరిచే అభ్యుదయ కవి ఈశ్వరరెడ్డి

-పుస్తకాల ఆవిష్కరణ సభలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

సమ సమాజానికి ఉపయోగపడే రచనలు చేస్తూ తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే అభ్యుదయ కవి డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి అని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. సూర్య చారిటబుల్ ట్రస్ట్, అభ్యుదయ రచయితల సంఘం, ఇంటాక్ కడప చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి రచించిన 'నిత్యబాలింత', 'సమాజహితం', సాహిత్యమతం' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ ఈశ్వరరెడ్డి రచనల్లో నేటి సమాజం కనబడుతుందని, మానవ సంబంధాలను బలపరిచేలా, మంచిని మేల్కొలి పేలా ఉంటాయన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా ఆయన కవిత్వం ఉంటుందని పేర్కొన్నాపరు. సభాధ్యక్షులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కులసచివులు డాక్టర్. ఎల్.వి.కె.రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యత, స్పృహ కలిగిన రచయిత ఈశ్వరరెడ్డి అని కొనియాడారు. రోజూ మన మధ్య జరిగే సంఘటనలు ఇతివృత్తాలు ఈయన పుస్తకాల్లో కనిపిస్తాయన్నారు. విభిన్న వ్యక్తిత్వం, వినూత్న సాహిత్యంతో పయనించే సరిహద్దులులేని కవిగా ఆయనను అభివర్ణించారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లా డుతూ జీవితపు విలువ తెలిసిన కవి ఈశ్వరరెడ్డి అని, అందువల్లే 16 గ్రంథాలు రచించారన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్న పరెడ్డి మాట్లాడుతూ ఈశ్వరరెడ్డి రచనలు నిద్రాణదశలో ఉన్నవారిని చైతన్యపరుస్తాయన్నారు. కార్యక్రమంలో రచయిత కుటుంబ సభ్యులు, సాహితీ వేత్తలు,పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఎ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎఫ్ఎ - 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థికీ అసెస్మెంట్ బుక్లెట్ అందించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టెక్స్ బుక్స్ ప్రెస్ రాము ఆదేశించారు. ఆదివారం వైఎస్ఆర్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని సిఎస్ఐ పాఠశాలలో ఉన్న డిసిఇబి హాలును, వల్లూరు మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్నమయ్య జిల్లాలోని రామాపురం, సంబేపల్లి, టి.సుండుపల్లి మండలాల పాఠ్యపుస్తకాల సరఫరా పాయింట్లను తనిఖీ చేశారు. మండల విద్యాశాఖ అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలలోని విద్యార్థికి తరగతి వారీగా, సబ్జెక్టు వారీగా అసెస్మెంట్ బుక్‌ను తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఎఫ్ఎ - 1 మొదలుకుని అన్ని పరీక్షలు అసెస్మెంట్ బుక్‌లో నిర్వహించాలని సూచించారు. అసెస్మెంట్ బుక్స్ ఏ మండలంలోనైనా అదనంగా ఉంటే సమీప మండలాలకు అందజేయాలని పేర్కొన్నారు. అసెస్మెంట్ బుక్కులో ఆగస్టు, అక్టోబర్, నవంబర్, 2025-26 జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల అనంతరం తరగతి ఉపాధ్యాయులు అసెస్మెంట్ బుక్స్ భద్రంగా ఉంచుకుని, తరువాత పరీక్షలను ఇందులో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కడప ఎంఇఒ -2 ఇర్షాద్ అహ్మద్, ఉమ్మడి జిల్లాల బుక్స్ గోడౌన్ మేనేజర్ రామాంజనేయులు, దేవి, జిల్లా బుక్స్ గోడౌన్ సిబ్బంది సురేష్, అనిల్, కడప సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.



జాతరకు హాజరైన ప్రజలు

వైభవంగా ముత్తు మారెమ్మ జాతర

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలో ముత్తు మారెమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పోతురాజును మేళతాళాలతో ఊరేగింపుగా ఊరి పొలిమేర కన్యకా చెరువు వద్ద ఉన్న అనంతపురమ్మ ఆలయం వరకు వెళ్లి అనంతపురమ్మను వెంట తీసుకు రాగా జాతర తంతు ప్రారంభమయింది. గ్రామంలోని ప్రతి వీధి నుండి పెద్ద ఎత్తున మహిళలు అంబల్లు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ మొదలియార్, జాతర కమిటీ నిర్వాహకులు శ్రీరామ్ కిరణ్‌కుమార్, నాగరాజు, సేలం సుధాకర్, సేలం సురేష్ మురళి, ప్రశాంత్, దినేష్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి కో-ఆర్డినేటర్ సత్తార్

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

- కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి కో-ఆర్డినేటర్ సత్తార్

ప్రజాశక్తి - కడప

జడ్‌పిటిసి పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి కో- ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్, యూత్ కాంగ్రెస్ ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్మయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్రమ్, నగర అధ్యక్షులు ఆసిఫ్‌ఖాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కడప నగరం క్రిస్టియన్ లైన్‌లో ఉన్న ప్రజాకేర్ ఆస్పత్రిలో ఏర్పాటు మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జడ్‌పిటిసి పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి-పూల భాస్కర్,శివ కళ్యాణారెడ్డిని గెలిపించాలని కోరారు. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్షం వైసిపి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని డబ్బును మంచినీళ్లలాగా ఖర్చు పెడుతున్నారని విమర్శించారు. కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారు అని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టి ఆశ పెడుతున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రాదేశిక నియోజక వర్గాలలో 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాదేశిక నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా పొన్నతోట గంగమ్మ వర్ధంతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పొన్నతోట వెంకటరెడ్డి సతీమణి పొన్నతోట గంగమ్మ 19వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంకాళమ్మ గూడూరులో పొన్నతోట దంపతుల స్తూపం దగ్గర స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి దంపతులు స్వాతం త్రోద్యమంలో రైతులు, రైతు కూలీల కోసం అహర్నిశలు కృషి చేశారని కొని యాడారు. కార్యక్రమంలో పొన్నతోట సత్యప్రసాద్‌రెడ్డి, పొన్నతోట సరళ, గ్రామ ప్రజలు, దళిత నేతలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన 'పెనుబాల'

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ దళిత నాయకుడు పెనుబాల విజయ్‌కుమార్ ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అన్నమయ్య పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు సమక్షంలో టిడిపిలో చేరారు. రాంప్రసాద్ రెడ్డి పెనుబాలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో లోకేష్ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకుంటారని తెలిపారు. చంద్రబాబు పిలుపుమేరకు కొన్ని గ్రామాలను దత్తత తీసుకుంటానని చెప్పారు. కూటమి అభివృద్ధి బాబును సిఎంగా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు. జడ్‌పిఇసి ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వివేకానంద రెడ్డి కుమార్తె సునీతకు న్యాయం చేయాలని, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవిని కోరారు.



పెనుబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

క్రైం కార్నర్



ప్రమాదానికి గురైన కారు

కాల్వపైకి దూసుకెళ్లిన కారు .. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని రాయచోటి-మదనపల్లె జాతీయ రహదారిపై దేవగుడిపల్లి వద్ద కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి అదుపుతప్పి డ్రెయినేజీ కాల్వ పైకి దూసుకెళ్లింది. ఈ సమయంలో కారులో ప్రయాణిస్తున్న బలిజపల్లికి చెందిన నలుగురు సురక్షితంగా బయట పడ్డారు. వీరు మూడవ శ్రావణమాసం సందర్భంగా గండి క్షేత్రానికి పోయి తిరిగి వస్తున్న సమయంలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారు వెనక భాగం పూర్తిగా దెబ్బతిన్న అందులో ఉన్నవారికి ఏమాత్రం చిన్న గాయం కూడా కాకపోవడంతో దేవగుడి పల్లె ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.